క్లుప్తంగా

బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా రవి



బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కల్లూరి రమేశ్(రవి)ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామానికి సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మహిపాల్‌రెడ్డి తదితరులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

24న కలెక్టరేట్‌ల వద్ద మహాధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా వెంటనే ఏర్పాటు చేయాలని ఈనెల 24న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు గద్దల మహేందర్ అన్నారు. ఆదివారం దూల్మిట్ట మండల కేంద్రంలో ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ ప్రాంతం అస్తవ్యస్తంగా విడదీశారన్నారు. కొంతకాలం నుంచి అనేక ప్రజాఉద్యమాలు చేస్తున్నప్పటికీ పాలకుల్లో చలనం లేదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బండి చంద్రయ్య, సుందరగిరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపూరిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.3లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండమీది సంతోషి కరుణాకర్, ఉపసర్పంచ్ ఎల్లేశం, వార్డు సభ్యులు నర్సింహులు, బీమ సత్యనారాయణ, బీమరాజు, లింగం, వెంకటేశం, యాదగిరి, స్వామి శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

కొండపాక(గజ్వేల్): 108లో ఓ గర్భిణి ప్రసవించింది. మర్పడ్గ గ్రామానికి చెందిన గర్భిణి ఎండీ సిమ్రాన్‌కు ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. ఆశ వర్కర్ వసంత 108కు సమాచారం అందించగా వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య సిబ్బంది తరలిస్తున్నారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. మెడికల్ టెక్నిషియన్ మహేందర్ 108 కాల్ సెంటర్ వైద్యుడు గోపికి సమాచారాన్ని అందించి, ఆయన సూచనలతో ప్రసవం చేశాడు. గర్భిణి మగశిశువుకు జన్మించింది. తల్లీబిడ్డ ఇద్దరినీ సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది చేర్పించారు.

ఉద్యమం తీవ్రతరం చేయాలి

చేర్యాల (సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమాన్ని ఉధృతం చేయలని చేర్యాల మండల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ బొమ్మగోని అంజయ్యగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చుంచనకోటలో సర్పంచ్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన అఖిలపక్షం సమావేశమైంది. ఈ సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ, చేర్యాల రెవెన్యూ డివిజన్‌గా ప్రభుత్వం ప్రకటించేంత వరకూ పార్టీలకతీతంగా ఆలుపెరుగని పోరాటం చేయాలని, అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, యువకులు, మహిళలను కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ అఖిలపక్ష జేఏసీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పాకల భిక్షపతి, కోకన్వీనర్లుగా అక్బర్‌పాషా, నిమ్మ నర్సిరెడ్డి, సుతారి రమేశ్, కార్యదర్శిగా బంగారి అయిలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలు వీరే



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మహాదేవ్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలోని హైస్కూల్లో ఆదివారం ఒకినవ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలోనిర్వహించిన గ్రేడింగ్ టెస్టులో విద్యార్థులు గ్రీన్, బ్రౌన్, బ్లూ బెల్ట్‌లు పొందారు. విజేతలైన గజ్వేల్లి కిశోర్, పి.జలెందర్‌లు, పి. కల్పన, కె.రక్షన్, ఎ.గౌరీప్రసాద్, ఎండీ సోహెల్ పలు రకాల బెల్ట్‌లను సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా మహాదేవ్‌గౌడ్ మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ బెల్ట్ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ తిరుపతి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

‘పందిల్ల’ వెలవెల



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ప్రాథమిక పాఠశాలలో తగ్గిన విద్యార్థుల సంఖ్య

హుస్నాబాద్‌రూరల్: పందిల్ల ప్రాథమిక పాఠశాల నాడు విద్యార్థులతో కళకళలాడింది. నేడు వారి సంఖ్య తగ్గి వెలవెలబోతోంది. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులు రికార్డులో 30 మంది నమోదయ్యారు. కానీ 15 మందే హాజరువుతున్నట్లు తెలుస్తోంది. బడికి ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని వచ్చిన పిల్లలకు విద్యాబోధన చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో వీరు ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడం కూడా ఓ కారణమని సమాచారం.

గతంలో ఇలా

పందిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 2017లో పిల్లలు లేక మూతపడింది. ఇక్కడున్న ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి పక్క ఊరి బడిలో విధులు నిర్వర్తించారు. కాగా నాటి అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలను బలోపేతం చేయాలని బడిబాటకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ బడులకు విద్యార్థులు వచ్చేలా వేసవి సెలవుల్లో కార్యాచరణ రూపొందించి సంఖ్య పెంచారు. దాతల సహకారం తీసుకొని ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేయించి డిజిటల్ విద్యా బోధన చేశారు. దీంతో పందిల్ల పాఠశాల విద్యార్థుల సంఖ్య సున్నా నుంచి 100కు చేరింది. అప్పుడు ఉపాధ్యాయుడితోపాటు మరో ముగ్గురు డిప్యూటేషన్‌పై వచ్చి విధులు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు ఇద్దరు వలంటీర్లను విధుల్లోకి తీసుకొని సొంత నిధుల నుంచి వేతనాలిచ్చారు. 2020లో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి రిటైర్డ్ అయ్యారు. దీంతో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గింది.



డిజిటల్ విద్యా బోధన (ఫైల్)

ప్రస్తుతమిలా

బడిబాటలో భాగంగా.. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి అని అడిగిన సందర్భం ఎక్కడా కనిపించలేదు. గతంలో దాతలిచ్చిన ప్రొజెక్టర్లు, ఎల్‌ఈడీ టీవీలు మూలనపడ్డాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు వారి ఇష్టం వచ్చినప్పుడు పాఠశాలలకు హాజరువుతున్నట్లు ఆరోపణలున్నాయి. నాలుగు మండలాలకు ఒకే ఎంఈఓ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుండటం కూడా ఓ కారణమని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం..

పందిల్ల పాఠశాలలో 20 లోపు విద్యార్థుల సంఖ్య ఉండేది. దీనిపై సర్పంచ్‌కు, గ్రామస్తులకు బడి మూతపడుతుందని చెప్పడంతో పిల్లల సంఖ్య 30కు పెరిగింది. పాఠశాల ఉపాధ్యాయుడు పదవీ విరమణ చేయడంతో 2020 నుంచి పోస్టు ఖాళీగానే ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించి విద్యా బోధన చేయిస్తున్నాం. ఉపాధ్యాయులు బడికి వెళ్లి చదువు చెప్పేలా చర్యలు తీసుకుంటాం.

దేశిరెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ, హుస్నాబాద్

నేడు టీఎస్‌యూటీఎఫ్ దీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన దీక్ష చేపడుతున్నట్లు సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలి అహ్మద్, తప్పెట్ల యాదగిరి తెలిపారు. ఆదివారం సంఘం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల పాఠశాలలు ఉపాధ్యాయులు బోధనేతర విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. ప్రమోషన్లు, బదిలీలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలను రాష్ట్రంలోని ఆరు సొసైటీలు నడుపుతున్నాయని, వీటిలో ఏకరూప పరిపాలన తీసుకురావాలన్నారు. గురుకులాల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై దీక్ష విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఆదివారం పద్మశాలి, యాదవ కులసంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): మండలంలోని వర్గల్ తదితర గ్రామాలలో ఆదివారం బోనాల సంబురాలు జరిగాయి. ఆయా గ్రామాలలో పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లు, శివసత్తుల మధ్య బోనం కడవలతో మహిళలు ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాలకు చేరుకున్నారు. బోనం సమర్పించి తమను చల్లగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపు దృశ్యం

గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌వలీ అహ్మద్, కార్యదర్శి వెంకట కిరణ్ పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగే నిరసన దీక్ష విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు మండలాల్లోని వివిధ గురుకులాలను సందర్శించి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని అలిరాజ్‌పేటలో ఎస్‌టీ. విన్సెంట్ హైస్కూల్‌లో ఫ్రేషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు నమ్ముకుని పాఠశాలకు పంపిస్తారని, దానిని వమ్ము చేయకుండా నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి కన్నవాళ్ల కలలను సాకారం చేయాలని కోరారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల పరివర్తన పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు జానపద గీతాలు, సినీ పాటలు ఆలపించారు, తీన్మార్ నృత్యాలు చేశారు. గతేడాది పదో తరగతిలో 10 గ్రేడ్ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్, ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రమ్య రవి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలో, ఎస్ఐ కృష్ణమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మురుగు ఇలా.. నడిచేదెలా?



పట్టణంలోని ధనలక్ష్మి కాలనీలో 3 రోజులుగా మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. పాత డ్రైనేజీలను బ్లాక్ చేయడం, కొత్తగా చేపట్టిన యూజీడీలోకి కలుపకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ గజ్వేల్ డివిజన్ నాయకులు బంధ్ల స్వామి కోరుతున్నారు. - గజ్వేల్‌రూరల్

కొనసాగుతున్న సమ్మె

తొగుట(దుబ్బాక): సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శంకర్ మాట్లాడారు. న్యాయమైన డిమాండ్లు సాధించుకునే దాకా పోరాడతామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

చెత్త సేకరించిన ఎంపీటీసీ

బెజ్జంకి (సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్ లో పేరుకుపోయిన చెత్తను ఎంపీటీసీ కొమిరె మల్లేశం ట్రాక్టర్ నడిపి ఇళ్ల వద్ద చెత్త ఆదివారం సేకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటులో భాగంగా సోమవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ పండరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, సాజీద్‌పుర, శంకర్ నగర్, ఇంటిగ్రేడెట్ మార్కెట్, బోయగల్లి, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.



దుబ్బాక: 5కే రన్ ప్రారంభిస్తున్న సీఐ కృష్ణ

ఉత్సాహంగా మారథాన్

మద్దూరు(హుస్నాబాద్): ఆగస్టు 6న సిద్దిపేటలోని రంగనాయక్ సాగర్ పై నిర్వహించే హాఫ్ మారథాన్ రన్‌లో భాగంగా చేర్యాల సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రమోషన్ 10కే రన్ ముస్త్యాల చౌరస్తా నుంచి మద్దూరు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఈ 10కే రన్‌లో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాలకు చెందిన యువతీ యువకులు ఉత్సహంగా పాల్గొన్నారన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఒక్కొక్కరికీ రూ.6వేల నగదును మద్దూరు వైస్ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం అందించారు. అయితే మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామానికి చెందిన యువకులకు హాఫ్ మారథాన్‌లో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు నారాయణగౌడ్, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రన్నింగ్‌తో ఆరోగ్యం: సీఐ మున్నూరు కృష్ణ

దుబ్బాక: ఆరోగ్యవంతమైనా సమాజ నిర్మాణానికి రన్నింగ్ ఎంతగానో దోహదపడుతోందని సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నర్లేన్‌గడ్డ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. సీఐ మున్నూరు కృష్ణ జెండా ఊపి పోటీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలంలో మనం ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ఎంతైనా అవసరమన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే పని ఏకాగ్రతతో చేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వ్యాయామం, యోగా, క్రీడా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఆగస్టు 6న మంత్రి హరీశ్‌రావు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే హాఫ్ మారథాన్ పోటీల్లో యువకులు పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ షాదుల్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



మద్దూరులో బహుమతులు అందజేస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి, సంతోష్‌కుమార్

చేర్యాలలో..

చేర్యాల (సిద్దిపేట): ఆగస్టు 6న సిద్దిపేట రంగనాయక్ సాగర్‌పై నిర్వహించే హాఫ్‌మారథాన్ విజయవంతం చేయాలని సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో ముస్త్యాల నుంచి మద్దూరు వరకు 10కే రన్ నిర్వహించారు.

బీఆర్‌ఎస్ ధన రాజకీయాలు చెల్లవు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ డబ్బు రాజకీయాలు పని చేయవని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో నియోజకవర్గంలోని రాయపోల్ మండలం కొత్తపల్లికి చెందిన బోనగిరి బాలరాజు, బోనగిరి స్వామి, ఎర్రోల్ల ప్రశాంత్‌తోపాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలోకి చేరారు. శనివారం వీరు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా 24 గంటలు గడవక ముందే మళ్లీ సొంతగూటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని నిమిత్తం గజ్వేల్‌కు వెళ్లిన బీజేపీ నాయకులకు మాయమాటలు చెప్పి బలవంతంగా బీఆర్‌ఎస్ కండువాలు కప్పారని ఆరోపించారు. డబ్బులతో బీజేపీ నాయకులను కొనాలని చూస్తున్నారని, ఇక్కడ బీఆర్‌ఎస్ డబ్బు రాజకీయాలు ఎక్కువ రోజులు చెల్లవన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

హుస్నాబాద్: పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని, భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో ఐక్యతతో పద్మశాలీలను గెలిపించుకోవాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం అడహక్ కమిటీ సభ్యుడు డాక్టర్ మార్త రమేశ్ అన్నారు. పట్టణంలోని శివ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలీ ఆత్మీయ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పద్మశాలీలు జనాభా ప్రకారం ఎక్కువగా ఉన్నప్పటికీ సంస్థాగత, స్థానిక ఎన్నికల్లో వారికి తగిన ప్రాధాన్యత లేదన్నారు. దామాషా ప్రకారం ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలన్నారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దీకొండ పద్మనాభం, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొల్ల నరేందర్, సంఘం నాయకులు వడ్డెపల్లి వెంకటరమణ, గాజుల గవాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పద్మశాలీ సంఘం నాయకులు

క్రీడల్లో సత్తా చాటాలి

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని టెన్నీస్ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌కే హైదర్‌పటేల్ పేర్కొన్నారు. టెన్నీస్ వాలీబాల్ సృష్టికర్త వెంకటేష్ వాంగ్వాడ్ జన్మదినం సందర్భంగా పట్టణంలో ఆదివారం అంతర్జాతీయ టెన్నీస్ వాలీబాల్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు తమకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా టెన్నీస్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే టెన్నీస్‌వాలీబాల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నవీన్, ఉపాధ్యక్షురాలు విజయరేఖ, గోవర్ధన్‌రెడ్డి, నరేష్‌కుమార్, స్టేట్ రెఫరీ నర్సింలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సంక్షిప్త వార్తలు

◆ **నాచగిరీశుడిని దర్శించుకున్న నిరంజన్‌రావు**

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రాన్ని ఆదివారం ఉపలోకాయుక్త డాక్టర్ వీ నిరంజన్‌రావు కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కట్టా సుధాకర్‌రెడ్డి అధ్వర్యంలో ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవాలయంలో నాచగిరీశుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. మహదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేసి, సన్మానించారు.

◆ **24వ రోజుకు భూనిర్వాసితుల దీక్ష**



వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం ప్రభుత్వం సేకరించిన భూమికి చట్టబద్ధ పరిహారం అందజేయాలన్న డిమాండ్‌తో మండలంలోని అవుసులోనిపల్లి వద్ద భూనిర్వాసితులు చేపట్టిన దీక్ష ఆదివారం 24వ రోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ గుర్రాల యాదయ్య ఆధ్వర్యంలో సాగుతున్న దీక్షలో భూనిర్వాసితులు చిందం నర్సింలు, నర్సారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందు తదితరులు కూర్చున్నారు.

◆ **కొత్త కమిటీల నియామకాలపై చర్చ**

గజ్వేల్: సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం గజ్వేల్‌లోని ఎస్‌వీ బాంకేట్ హాల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యవర్గం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త కమిటీ నియామకానికి ఎన్నికల నిర్వహణ, మండల కమిటీల ఏర్పాటు, రెఫరీ బోర్డు ఏర్పాటు, మహిళ కమిటీ నియామకం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో కోశాధికారి సత్యం, సంయుక్త కార్యదర్శి సంపంగి రాజు, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రంగనాథ్, కార్యవర్గసభ్యులు శ్రీకాంత్, మహేశ్, నరేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మాజీ సర్పంచ్ కన్నుమూత**

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌కు చెందిన పొద్దుటూరి రాంరాజేశం వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఆదివారం తెల్లవారుజాము కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ప్రజ్ఞాపూర్ గ్రామానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రాంరాజేశం మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పంబాల శివకుమార్, తుమ్మ శ్రీనివాస్ తదితరులున్నారు.

◆ **బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి**

దుబ్బాక: అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని 8వ వార్డు కౌన్సిలర్ బత్తులస్వామి అన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ధర్మాజీపేట వార్డులో రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్ సంఘం పనులు చివరిదశకు చేరాయన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, మల్లేశం ,సత్తయ్య, లక్ష్మణ్, తదితరులున్నారు.

◆ **ఆపదలో ‘పొదుపే’ ఆసరా**

నంగునూరు(సిద్దిపేట): డబ్బులు పొదుపు చేస్తే ఆపద సమయంలో ఆదుకుంటాయని పురుషుల పొదుపు సంఘం మండలాధ్యక్షుడు కడారి తిరుపతి రెడ్డి అన్నారు. నంగునూరులో సంఘం సభ్యుడు వల్లపురెడ్డి లక్ష్మారెడ్డి ఇటీవల మరణించగా, అతడి భార్య వినోదకు అభయనిధి, సామూహిక నిధి నుంచి రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సంఘం సభ్యులకు అప్పులు ఇవ్వడంతోపాటు బీమా ద్వారా వారి కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు.

◆ **ఆషాఢ గోరింటాకు సంబురాలు**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ వనిత క్లబ్ సిద్దిపేట ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైశ్య భవన్లో ఆషాఢ మాస గోరింటాకు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గో సేవ, వాసవీ మాత పారాయణం, దాండియా తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ సోమ వనజ, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి, వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **ప్రతిపక్షాల తీరు హేయం**

ములుగు(గజ్వేల్): తెలంగాణ రైతాంగంపై ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరు విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా మండిపడ్డారు. ఆదివారం ములుగులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుండటాన్ని చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. రైతు బంధు ద్వారా ఆర్థిక సాయం అందిస్తుండడంతో రైతులు అప్పుల జోలికి వెళ్లడం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తంజేశారు. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడడం రైతుల నడ్డి విరిచేలా ఉందన్నారు.

◆ **మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు**

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించాలని వైద్యశాఖ అధికారులకు వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశాలివ్వడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు జానకిరాములు, సంజీవ్, మల్లేశం ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.